క్లుప్తంగా

మేమంతా సిద్ధం బస్సు యాత్రకు తరలిరండి

పరవాడ: పెందుర్తి కూడలిలో ఆదివారం ఉదయం 9 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు మండల నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

క్యాన్సర్ బాధితురాలికి రూ.15 వేల సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీబంగారు తల్లి సేవా సమితి సభ్యులు

సబ్బవరం: క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి మామిడి హేమంత కుమారికి సబ్బవరం శివారు జోడుగుళ్లకు చెందిన శ్రీబంగారు తల్లి సేవా సమితి సభ్యులు శనివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. చిన్నారి తల్లిదండ్రులు మామిడి సంజీవరావు,మామిడి లక్ష్మి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.దీంతో విషయం తెలుసుకున్న సింగంపల్లి వెంకటరావుతో పాటు మిగిలిన సభ్యులతో కలిసి ఆర్థిక సాయం చేశారు. సంఘం సభ్యులు గెడ్డం సూరిబాబు,గొంప ప్రసాదరావు,ఎల్. త్రినాథ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సత్యరాజు తదితరులు

సబ్బవరం: వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ప్రజలు, స్వయం సహాయక బృందాల మహిళలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.స్థానిక ఫైర్ ఆఫీసర్ జీవీ సత్యరాజు అగ్నిమాపక పరికరాల వినియోగించే విధానం, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది కె. రాజారావు,కె. ఎల్లాజీ, ఎం. శ్యామ్ కుమార్,వి. ద్వారకాద్రి, సత్తిబాబు, బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సంగీతంలో శిక్షణకు దరఖాస్తులు

సీతంపేట: కర్ణాటక సంగీతంలో ఉచితంగా శిక్షణకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర, వాయిద్య, వేద అభ్యాసంలో శిక్షణ పొందడానికి విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులతో ఈ నెల 28వ తేదీ ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు తాటిచెట్లపాలెం ఇ.కె.సంస్కృతి సదన్‌లో జరగనున్న ఎంపిక కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల వారు వివరాల కోసం 93983 14502 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హనీఫ్‌కు సీనియర్ కమాండెంట్‌గా పదోన్నతి



బాధ్యతలు స్వీకరిస్తున్న హనీఫ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్ కమాండెంట్ అత్తార్ మొహ్మద్ హనీఫ్‌కు సీనియర్ కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. 2006 బ్యాచ్‌కు చెందిన హనీఫ్ స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్ కమాండెంట్‌గా 2022 ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరించారు. కర్ణాటకకు చెందిన హనీఫ్‌కు తెలుగు భాషపై మంచి పట్టు ఉంది. ఆయన స్టీల్‌ప్లాంట్‌లో నేర నియంత్రణకు కృషి చేయడంతో, నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. సీఐఎస్‌ఎఫ్ ఉన్నత యాజమాన్యం నుంచి పదోన్నతి ఉత్తర్వులు రావడంతో ఆయన శనివారం సీనియర్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు అభినందించారు.

- పెందుర్తి నియోజకవర్గంలోకి మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- దారి పొడవునా బైక్ ర్యాలీ
- హోరెత్తిన జై జగన్ నినాదాలు
- చిన్నయ్యపాలెంలో బస చేసిన సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్



రాత్రి వేళ రోడ్డుపై ఉన్న అభిమానులకు బస్సు నుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

పెందుర్తి: సంక్షేమ రథసారథి.. నిరుపేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్ యాత్ర శనివారం రాత్రి పెందుర్తి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. బాట జంగాలపాలెం నుంచి చిన్నయ్యపాలెం సమీపంలోని టెర్రకాన్ లేఅవుట్ వరకు అభిమానులు అడుగడుగునా జై జగన్ అంటూ నినదించారు.

పారదర్శక పాలన అందించిన జగనన్నకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాక వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సహా పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ తరుణంలో చేరిన సీఎం జగన్ బస్ యాత్ర మరింత హుషారు నింపింది. శనివారం రాత్రి సీఎం వైఎస్ జగన్ బస్ యాత్ర సబ్బవరం వస్తున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జనం తరలివచ్చారు. ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా సాగిన బస్ యాత్ర ఆద్యంతం జై జగన్, జైజై జగన్ నినాదాలతో మార్మోగింది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు జగన్‌ను చూసేందుకు ఆరాటపడ్డారు. సీఎం జగన్ అందరికీ అభివాదం చేస్తూ చిన్నయ్యపాలెంలోని బసకు చేరుకున్నారు.



అదిగో జగనన్న.. అభిమానుల ఆనంద హేల



సీఎం వైఎస్ జగన్ బస్సును అనుసరిస్తూ సాగుతున్న బైక్ ర్యాలీ



ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

వైభవంగా అప్పన్న తిరువీధి

- నేడు పండిత సదస్యం
- నేడు ఉదయం 8 నుంచి దర్శనాలు ప్రారంభం
- రాత్రి 7 గంటల వరకే దర్శనాలు



శేషవాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



స్వామికి హారతి అందజేస్తున్న అర్చకుడు



నృత్యం చేస్తున్న చిన్నారులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం స్వామికి శేషవాహనంపై విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషవాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రావణ్, చక్రపాణి, రాజీవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

కల్యాణోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం ఉదయం 7.30గంటల నుంచి వైదిక సదస్యం, సాయంత్రం 3.30గంటల నుంచి పండిత సదస్యం, సాయంత్రం 6గంటలకు సర్వజన మహోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు. కాగా స్వామివారి దర్శనాలు ఆదివారం ఉదయం 8 నుంచి ప్రారంభై రాత్రి 7గంటలతో ముగుస్తాయని అధికారులు తెలిపారు.సింహగిరిపై జరుగుతున్న వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తూర్పు తీరంలో 'పూర్వీ లెహర్'



సముద్రంలో కాల్పులు జరుపుతున్న భారత నావికాదళానికి చెందిన నౌక

సింధియా: తూర్పు తీరంలో భారత నావికాదళం పూర్వీ లెహర్‌ను నిర్వహించింది. ఆపరేషన్ కంట్రోల్‌లో భాగంగా తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సముద్ర భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు, భారత నావికాదళం సన్నద్ధతను అంచనా వేయడమే లక్ష్యంగా విన్యాసాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భారత నావికాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, ప్రత్యేక దళాలు పాల్గొన్నాయి.

16 నుంచి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రిక ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై మే 16 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు..వెంకన్న స్వామిని శనివారం ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వదర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

'గంగవరం' కార్మికుల ఆందోళనకు సీపీఎం మద్దతు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెదగంట్యాడ: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికులు పోర్టు గేటు వద్ద చేపట్టిన ఆందోళన 11వ రోజుకు చేరుకుంది. నిర్వాసిత కార్మికుల ఆందోళనకు సీపీఎం మద్దతు తెలిపింది. శిబిరాన్ని సందర్శించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు ఒకే ఏడాదిలో రూ.800కోట్లు లాభాలు ఆర్జించిదంటే దానికి ప్రధాన కారణం కార్మికులేనని, అటువంటి కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. కలెక్టర్ మాట గానీ, నగర పోలీస్ కమిషనర్ మాట కూడా పట్టించుకోని పోర్టు యాజమాన్యం మెడలు వంచే వరకూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 11 రోజులుగా పోర్టులో కార్యకలాపాలు నిలిచిపోయాయని, దీనికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్మికుల పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గంగవరం పోర్టు నిర్వాసితుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమిలిలో గెలుపు నాదే..



సింహగిరిపై గిరిజన గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మోదీ స్ట్రీట్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఫేక్ న్యూస్ క్రియేట్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు
- పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు అనుమతి ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే
- ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- సింహగిరిపై గిరిజన గ్రామంతో పాటు మోదీ స్ట్రీట్‌లో ఎన్నికల ప్రచారం

సింహాచలం: చంద్రబాబు, గంటా శ్రీనివాసరావు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా భీమిలిలో మళ్లీ గెలుపు నాదే అని వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు ఓ నియోజకవర్గం మార్చే గంటా గ్యాంగ్ ఈ సారి తప్పుడు ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. అనకాపల్లి వెళ్తున్నట్టు ఫేక్ న్యూస్ క్రియేట్ చేస్తున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. భీమిలి నియోజకర్గం పరిధి సింహగిరి కొండపై ఉన్న గిరిజన గ్రామంతో పాటు 98వవార్డు మోదీ వీధిలో శనివారం ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 24న భీమిలిలో నామినేషన్ వేయడం జరుగుతుందని తెలిపారు.

అర్హులందరికీ పథకాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పని చేశారన్నారు. అవినీతికి తావులేకుండా, వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే విశాఖ రాజధాని కావడంతో పాటు హైదరాబాద్, బెంగళూరుకు మించి విశాఖ అభివృద్ధి చెందుతుందన్నారు.

పంచగ్రామాల బాధితులకు అండగా ఉన్నాం

సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు అధికారికంగా అనుమతి ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే చెందుతుందన్నారు. భూసమస్య పూర్తిగా పరిష్కరించేందుకు కూడా జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. సింహాచలం దేవస్థానంకి ప్రత్యామ్నాయంగా ఆనందపురంలో ఉన్న రూ.1900 కోట్లు విలువైన భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మోదీ స్ట్రీట్ అధ్యక్షుడు భూపతిరాజు సూరపురాజు, కార్యదర్శి ఆర్.శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎస్. మోహన్‌రావు, కె.కనకరాజు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహ వీధి నాయకులు అక్రమంతి వరహాలు, పి.అప్పారావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, 93వవార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

- వలంటీర్లను సేవలను నిలిపివేయడంపై పలువురు మండి పడ్డారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు అండ్ కో కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని చందనపురి కాలనీకి చెందిన దివ్యాంగురాలు ఎస్. సూర్యకుమారి ఆవేదన వ్యక్తం చేశారు.

చెంతనే మెరుగైన వైద్యం



పెదగాడిలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్



పినగాడిలో నిర్మించిన అధునాతన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్

వైద్యం కోసం నిరుపేదలు అప్పుల పాలు కాకూడదన్న దృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రజలకు చేరువ హెల్త్ సెంటర్లు నిర్మించింది. గతంలో మండల కేంద్రాలు, పట్టణంలోనే లభించే సంపూర్ణ వైద్య సేవలు ఇప్పుడు చెంతనే అందుతున్నాయి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్/అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుంది. గ్రామ/వార్డు సచివాలయాల వారీగా హెల్త్ క్లినిక్‌లు నిర్మించి నిపుణులైన వైద్యుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వైద్య సేవలపై ప్రజలు సర్వాత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–పెందుర్తి



చినముషిడివాడ అర్బన్ హెల్త్ క్లినిక్‌లో అధునాతన బెడ్‌లు



పురుషోత్తపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

పెందుర్తి: పెందుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పి. భగత్ శనివారం నామినేషన్ వేశారు. ఆర్వో శేషశైలజకు నామినేషన్ పత్రాలు అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థులకు స్టార్టప్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఏయూ ఆహాబ్ సీఈవో రవి ఈశ్వరరావు మాట్లాడుతూ స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ప్రముఖ ట్రైనర్ అనంతరామ్ ఘనాపాటి పాల్గొని స్టార్టప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని.. దానిని కాపాడుకునేందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఐక్య ఉద్యమాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు శనివారానికి 1164వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారన్నారు. విదేశాల నుండి నల్ల ధనాన్ని తీసుకువస్తానని చెప్పి.. దేశంలోని బ్యాంకులను ఊడ్చేశారన్నారు. నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో కార్లు నిలిపేచోట శనివారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వ్యక్తికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండొచ్చు. నీలం రంగు జీన్‌ఫ్యాంట్ వేసుకున్నాడు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక.. లేదా సరైన ఆహారం లేక మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. కంచరపాలెం సిద్ధార్థనగర్ వీఆర్‌వో ఫిర్యాదు మేర కు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సమాచారం తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.